# పంద్రాగస్టు నాటికి భూ సమస్యలు పరిష్కారం

### కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్




సూర్యాపేటటౌన్, జూన్ 23 : పంద్రాగస్టు నాటికి జిల్లాలో రెవిన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలసి భూ భారతి అవగాహన సదస్సు, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భూభారతి చట్టం అమల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అధికారులే ప్రజల వద్దకు వెళ్ళి 44,741 అర్జీలను స్వీకరించారన్నారు. ఆ అర్జీలను మిస్సింగ్ సర్వే నెంబర్, డిఎస్ పెండింగ్, విస్తీర్ణం సవరణ, పౌతి అమలు, భూమి స్వభావం వంటి వాటిపై వచ్చినాయని విడి విడిగా అర్జీలను వేరు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒకే రకంగా అర్జీలను ఒకే విధానం ద్వారా పంద్రాగస్టు నాటికి పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించేందుకు ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో డెస్క్ పని చేసేందుకు ఒక బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు మరో బృందం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఏ గ్రామానికి క్షేత్రస్థాయి బృందం పరిశీలనకు వెళుతున్నారో ఆ రైతులకు ముందుగా నోటీసులు జారీ చేయాలని సూచించారు. రికార్డులు జత చేసిన అర్జీలను తీసుకొని క్షేత్రస్థాయి పరిశీలన చేసేందుకు వెళ్ళాలని అక్కడే పక్క రైతుల వాంగ్మూలం, పంచనామా చేయాలన్నారు. ఏమైనా వాదనలు వినాలనుకుంటే అక్కడిక్కడే పరిష్కరించుకోవాలని సూచించారు. ఒకే రకంగా జిల్లా వ్యాప్తంగా చెక్ మెమో తయారు చేసి అన్ని రికార్డులను జతపర్చి అధికారులు అందరూ సంతకం చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రలోబాలకు గురైనా తప్పుడు ఆలోచనలతో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. రేషన్ దుకాణాలు తహసీల్దార్‌లు, ఆర్‌ఐలు తనిఖీ చేసి స్టాక్ పరిశీలించాలని సన్నబియ్యం దుర్వినియోగం కాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. విద్యా సంవత్సరం మొదలైనందున విద్యార్థులకు ఆలస్యం కాకుండా కుల, ఆదాయం, రెసిడెన్షి సర్టిఫికెట్స్ వెంటనే జారీ చేయాలని సూచించారు.

### అర్జిదారులకు ఖచ్చితమైన సమాచారం

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించేప్పుడు ఖచ్చితమైన సమాధానం అర్జిదారులకు తెలియజేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. పతి శాఖకు సంబంధించిన ప్రజవాణి దరఖాస్తులు పరి ష్కరించడంలో నాణ్యత పాటిస్తున్నారా లేదా అని పరిశీలిం చాలన్నారు. దరఖాస్తులు ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖ పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యాలయంలోని అధికారులకు విధుల విభజన గురించి తెలపాలన్నారు. ఈసారి గత సంవత్సరం కంటే మెరుగ్గా ఉండాలన్నారు.

## కూలీలకు వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ



గరిడేపల్లి, జూన్ 23 : మండల పరిధిలోని గారకుంటతండాలో జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పధకంలో భాగంగా పనులకు వెళ్ళిన కూలీలకు హెచ్ఎస్ఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలో సోమవారం వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## 100రోజుల ప్రణాళికలో మురుగు కాల్వలు శుభ్రం



నేరేడుచర్ల, జూన్ 23 : 100 రోజుల ప్రణాళికలో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 7వ వార్డులో సోమవారం మురుగు కాల్వలలో పూడిక తీసి, వీధులను పరిశుభ్రం చేశారు. వార్డులో తడిచెత్త– పొడి చెత్త వేరు చేయు విధానం, ఎరువు తయారీపై, డెంగ్యూ, మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఫ్రైడేని డ్రైడేగా పాటించాలని సూచించారు. అనంతరం మంచినీటి ట్యాంక్‌ల నుంచి సరఫరా అయ్యే నీటిని క్లోరిన్ టెస్టులు చేశారు.

## విద్యార్థుల సౌకర్యార్థం ఆటో ఏర్పాటు



మఠంపల్లి, జూన్ 23 : మండలంలోని అల్లీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే కాల్వపల్లి, కొత్తతండా, పాత తండాలకు చెందిన విద్యార్థులు బడికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా బడిబాట కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులు ఆటోను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు మూడు తండాల నుండి పిల్లలను పాఠశాలకు తీసుకువస్తుందని ప్రదానోపాధ్యాయుడు శేషిరెడ్డి తెలిపారు. పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదవాలని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు అండగా ఉపాధ్యాయులు నిలవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పుస్తకదానం మహాదానం



గరిడేపల్లి, జూన్ 23 : చదువుకునే పిల్లలకు పుస్తకదానం చేయడం మహాదానమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ అన్నారు. రంగాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హుజూర్‌నగర్‌కు చెందిన అవోపా వ్యవస్థాపకులు స్వర్గీయ వంగవేటి హన్మంతరావు, చంద్రకళల జ్ఞాపకార్థం రూ.6500/–ల విలువ గల పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, స్టేషనరీని సోమవారం అందజేశారు. పేద విద్యార్థులకు విద్యాదానం వలన విద్యార్థుల భవిష్యత్‌కి బంగారు బాటలు వేసేందుకు సహకారం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం




కోదాడ, జూన్ 23 : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భవించి 70 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కోదాడలోని అన్ని ఎస్బీ శాఖల ఉద్యోగులు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ మేనేజర్ అనిల్‌కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం అని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. తమ బ్యాంకు 71వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోదాడలో ఆదివారం తమ బ్యాంకు ఉద్యోగులు 90 మంది ముందుకు వచ్చి రక్తదానం చేయడం తమకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. రక్తదానంతో ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.

## ట్రాన్స్ జెండర్లకు గుర్తింపుకార్డులు

సూర్యాపేటటౌన్, జూన్ 23 : ట్రాన్స్ జెండర్ వ్యక్తులు ట్రాన్స్ జెండర్ గుర్తింపు కార్డ్సుకు దరఖాస్తు చేసుకున్న 20మంది ట్రాన్స్ జెండర్స్‌కు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ట్రాన్స్ జెండర్స్ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జిల్లా జడ్పీ సీఈఓ అప్పారావు, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వృద్ధురాలిని బంధించి

## నగలు అపహరించిన నిందితుల అరెస్టు

### వివరాలు వెల్లడించిన డీఎస్పీ



*విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్*

సూర్యాపేటటౌన్, జూన్ 23 : వృద్ధురాలిని బంధించి నగలు అపహరించిన నిందితులను అరెస్టు చేసి వారి నుంచి స్విఫ్టు కారుతో పాటు నల్లపూసల గొలుసు, 5 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన బోడ వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ హైదరాబాద్ మేడిపల్లిలో నివాసముంటున్నాడు. గ్రామానికి చెందిన నంగునూరి బయ్యమ్మ(70) కుటుంబం జీవనోపాధి కోసం చెన్నై వెళ్లి స్థిరపడగా ఆమె భూమిని వెంకటేష్ మామ యాల రమేష్ కౌలుకు చేస్తున్నాడు. రమేష్‌తో పాటు నిందితుడు వెంకటేష్ అప్పుడప్పుడు బయ్యమ్మ ఇంటికి వెళ్ళేవాడు. ఆమె ఒంటరిగా నివసిస్తుందని, ఆమె ఒంటిపై ఉన్న బంగారం చూసి దొంగిలించాలని హైద్రాబాద్ మేడిపల్లిలో ఉంటున్న స్నేహితులైన తిరుమలగిరి మండలం మాలిపురంకు చెందిన పోతరాజు నాగరాజు, యాదాద్రి జిల్లా అడ్డగూడురు మండలం కాంచనపల్లికి చెందిన ఎడ్ల చంద్రశేఖర్, నాగారం మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన కొమ్ము సోమయ్య, వడ్డె పున్నంలతో కలసి పథకం వేశాడు. ఈ నెల 17న రాత్రి నాగరాజు స్విఫ్ట్ కారు ఎపీ 28 ఎజడ్ 0721లో హైద్రాబాద్ నుంచి ఈటూరుకు వచ్చి బాధితురాలు ఒక్కతే ఇంటి వద్ద నిద్రపోతుండగా ఆమె ఇంటి వెనుకాల గోడ దూకి తమ వెంట తెచ్చుకున్న కట్టర్‌తో కరెంట్ కట్ చేశాడు. ఆమె బయటకు వచ్చిన తరువాత వెంకటేష్ తాను ఆమె దగ్గరికి వెళితే గుర్తు పడుతుందని పక్కకు నిలబడగా మిగిలిన నలుగురు వెళ్ళి ఆమెను గట్టిగా పట్టుకొని ఆమె మెడలో ఉన్న నల్ల పూసల గొలుసు, చేతి గాజులు కట్ చేసి ఆమె చేతులను చీరతో కట్టి ఇంట్లో వెతికి ఇంట్లో ఉన్న నగల డబ్బాతో పారిపోయారు. నిందితులు తాము దొంగిలించిన బంగారం తిరుమలగిరి క్రాస్ రోడ్ వద్ద అమ్మడానికి ప్రయత్నిస్తుండగా నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్.ఐ. ఎం.ఐలయ్యలు పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారు. కేసును ఛేదించడంలో సమర్ధవంతంగా పని చేసిన సీఐ, ఎస్ఐలతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## తమ్ముడినుంచి మమ్మల్ని కాపాడండి

సూర్యాపేటటౌన్, జూన్ 23 : జిల్లా కేంద్రంలో హోంగార్డుగా పని చేస్తున్న మా తమ్ముడు మా భూమిపైకి మమ్మల్ని రానివ్వకుండా మా అమ్మను, మమ్మల్ని చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని మా తమ్ముడిపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని తల్లి సోనితో కలసి అన్నదమ్ములు బాలకోటి, బాలాజీలు జిల్లా కలెక్టర్, ఎస్పీలను వేడుకున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ నాన్న బిచ్చునాయక్ పేర ఉన్న 19 ఎకరాల భూమిలో ముగ్గురం అన్నదమ్ములం తలా ఆరు ఎకరాలు పంచుకొని ఒక ఎకరం మా తల్లిదండ్రుల పోషణ కోసం ఉంచామన్నారు. కాగా తమ తమ్ముడు పోలీసునంటూ తమను భూమిపైకి రానివ్వకుండా, కూలి వాళ్ళను బెదిరిస్తూ సాగుకు అడ్డం పడుతున్నాడని అన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన తమ తండ్రిపై తమ్ముడు దాడి చేయగా, తండ్రి అస్వస్థతకు గురై నెల రోజుల పాటు ఐసీయులో ఉండి మరణించినట్లు పేర్కొన్నారు. గతంలో ఈ విషయమై జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయగా ఉద్యోగం నుంచి తొలగించి కేసు నమోదు చేయగా ఇటీవల తిరిగి ఉద్యోగంలో చేరి మమ్మల్ని మరింత వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. తల్లిదండ్రుల పోషణ కోసం ఉంచిన ఎకరం భూమిని కూడా తన పేరు పట్టా చేయించుకొని ప్రస్తుతం మా తల్లి సోనిని చంపుతానని బెదిరిస్తున్నాడన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన తమను తమ్ముడు ఈశ్వర్ అతని భార్య మాపై రేప్ కేసులు పెడుతామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అడిషనల్ ఎస్పీ రవిందర్‌ను కలసి ఫిర్యాదు చేశామని జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్పందించి గ్రామంలో, డిపార్ట్‌మెంట్‌లో తమ్ముడు ఈశ్వర్‌పై తగిన విచారణ చేసి తమ భూమి తమకు అప్పగించి న్యాయం చేయాల్సిందిగా వారు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



*వినతిపత్రం అందదజేస్తున వి్రశాంత ఉద్యోగులు*

సూర్యాపేటటౌన్, జూన్ 23 : కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లు పేరుతో పెన్షనర్ల పీఆర్‌సి తదితర ఆర్థిక ప్రయోజనాలకు ఎసరు పెట్టేలా పార్లమెంట్‌లో ఆమోదించిన నల్లా చటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ళ సీతరామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పెన్షనర్లకు ఆశనిపాతం అయిన ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. చట్టం రద్దు కొరకు టీఎస్‌జిఆర్‌ఇఎ సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఒకే రోజు జిల్లా కలెక్టర్‌లకు, ప్రధానమంత్రికి వినతిపత్రం అందించే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల శాఖలు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి




మేళ్లచెర్వు, జూన్ 23 : జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వట్టెపు సైదులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు.



## గంగ దేవమ్మ జాతరలో జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, జూన్ 23 : మండల పరిధిలోని తుమ్మలపెనపహాడ్ గ్రామంలో జరుగుతున్న శ్రీ గంగ దేవమ్మ తల్లి జాతర వేడుకలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ పద్దతిలో పూజలు నిర్వహించి బేరి మోగించి సందడి చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తూడి నర్సింహ్మారావు, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, జీవన్‌రెడ్డి, బాషా, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ ముద్దం క్రిష్ణారెడ్డి, చంద్రారెడ్డి, గొట్టిముక్కల నర్సిరెడ్డి, కనుగు శ్రీను, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇవ్వాలి

పెన్‌పహాడ్, జూన్ 23 : మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని పెన్‌పహాడ్ మండల సీపీఎం కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సీపీఎం మహిళా కార్యకర్తలతో మాలసి దూపాడ్ గ్రామ కార్యదర్శి స్వప్నకి పలు డిమాండ్‌లతో కూడిపన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. భూమి లేని నిరుపేదలకు, పూరి గుడిసెలు కలిగిన వారికి మొదటి విడుతలో అవకాశం కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో ఎలాంఢ్ట రాజకీయాలకు తావు ఇవ్వకుండా న్యాయంగా నిరుపేదలకు న్యాయం జరిగేలా అధికారులు చోరవ తీసుకోవాలన్నారు. అనర్హులను ఎంపిక చేస్తే మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమంలో చేపడుతామన్నారు.

## అభినవ్ స్ఫూర్తిగా క్రీడల్లో రాణించాలి



కోదాడ రూరల్, జూన్ 23 : కోదాడ పట్టణ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటిన చదరంగం క్రీడాకారుడు మేకల అభినవ్‌ను ఆదర్శంగా తీసుకుని యువత క్రీడలలో రాణించాలని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం అభినవ్ 35వ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ అభినవ్ చిన్న వయస్సులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం క్రీడాప్రపంచానికి తీరని లోటని, ఆయన పేరుతో నిర్మించిన స్టేడియాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

### జిల్లా ఫస్ట్ విద్యార్థినికి సన్మానం

పదో తరగతి పరీక్షలలో జిల్లా ప్రథమ స్థానం సాధించిన కోదాడ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని తాళ్లూరి రేఖాశ్రీని నగదు బహుమతితో సత్కరించి ఉపాధ్యాయులను అభినందించారు. భవిష్యత్‌లో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించేందుకు మండల విద్యాధికారి, హెచ్ఎం, ఉపాధ్యాయ బృదం కృషి చేయాలని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి




గరిడేపల్లి, జూన్ 23 : విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని గానుగబండ, కొండాయిగూడెం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలకు వచ్చిన వంట సామాగ్రిని అందజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.

## గ్రామాల్లో నిఘా మరింత పటిష్టం



అనంతగిరి, జూన్ 23 : సీసీకెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో నిఘా మరింత పటిష్టంగా మారుతుందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శాంతినగర్లో దాతల సహకారంతో గ్రామంలో ఏర్పాటుచేసిన సీసీకెమెరాల కంట్రోల్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా సరిహద్దుతో పాటు కోదాడ, ఖమ్మం రహదారిపై ఉన్న శాంతినగర్‌లో సీసీకెమెరా ఏర్పాటు అవసరం అన్నారు. గ్రామంలో కెమెరాల ఏర్పాటుకు తోడ్పాటు నందించిన దాతలకు అభినందనలు తెలిపారు. నేర పరిశోధనలో సీసీకెమెరాలు పోలీస్ శాఖకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్, మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పెద్దలు, గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, వెంపటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంపదనుదోచిపెడుతున్న కేంద్రం

### సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నాగార్జునరెడ్డి




*మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జునరెడ్డి*

నూతనకల్, జూన్ 23 : మన దేశంలో సుమారు 70 శాతం సంపదను ఐదు శాతం ఉన్న పెద్ద పెద్ద కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడి దారులకు నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని తొట్ల మల్సూర్ స్మారక భవనంలో నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి మండల రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ముఖ్యంగా 60 శాతం ఉన్న రైతులకు వ్యతిరేకమైన చట్టాలను తీసుకొచ్చి రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఎన్నో సంవత్సరాలు కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగించి వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల బతుకులు బజారున పడేసిందన్నారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు లేకుండా పెంచి ప్రజలపై భారం మోపుతోందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలను వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి పేద, మధ్య తరగతి వర్గాలకు అనేక భారాలను మోపుతోందని అన్నారు. దేశంలో ప్రధాన ఎజెండాగా హిందూ, ముస్లిం ఐక్యతను దెబ్బతీసే విధంగా హిందుత్వం పేరుతో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా మోడీ విధానాలు ఉన్నాయని అన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ ఈరోజు బీఆర్ఎస్ ఎజెండాను అమలు చేస్తూ మైనార్టీ వర్గాల మీద దాడులను ప్రోత్సాహిస్తోందని విమర్శించారు. మన దేశ సార్వభౌమత్వాన్ని లౌకిక విధానాన్ని పూర్తిగా తొలగించి హిందుత్వాన్ని తీసుకొచ్చి ప్రజల మధ్యన చిచ్చు పెడుతోందని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతోమంది నక్సలైట్లను అతి దారుణంగా చంపేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఆపరేషన్ వెంటనే ఆపాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, నూతన కల్లు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాసు, పులుసు సత్య, మద్దిరాల మండల కార్యదర్శి పోలోజు సైదులు, భాస్కర్, బొజ్జ శ్రీను, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, తొట్ల లింగయ్య, బత్తుల జనార్ధన్, సూడి మధుసూదన్‌రెడ్డి, తొట్ల అచ్చయ్య, హరీష్, విజయ్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సహకారం అవసరం



*మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీన*

హుజూర్‌నగర్ జూన్ 23 : కేసుల పరిష్కారంలో న్యాయవాదుల సహకారం అవసరమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీన అన్నారు. సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తాన్నారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని న్యాయవాదులకు సూచించారు. అనంతరం నూతన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, యాదగిరి, జక్కుల నాగేశ్వర్‌రావు, రేణుక, సంధ్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

### యువకుల ఘర్షణలో 16 మందిపై కేసు నమోదు, అరెస్ట్

నేరేడుచర్ల, జూన్ 23 : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు హెచ్చరించారు. సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరేడుచర్లలో ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఊహించనది, అకస్మికంగా జరిగిన సంఘటనే తప్ప ఇతర కక్షలు కావని, సోషల్ మీడియాలో ప్రచారం జరిగినట్లుగా గ్యాంగ్ వార్ లేదా రెండు వర్గాలు, రెండు గ్రామాల మధ్య జరిగిన ఘర్షణలు కావని పేర్కొన్నారు. ఒక వార్గనికి చెందిన కుటుంబ సభ్యుల సంవత్సరీకానికి కొంత మంది యువకులు రామాపురం రోడ్డులోని వైన్‌షాప్ వద్దకు వచ్చారు. అదే సమయంలో మద్యం సేవించి ఉన్న పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన యువకులు అక్కడికి వచ్చి మీకు మద్యం మీము తాపిస్తామన్నారు. మీరు ఎవరు, మాకు మద్యం తాపించేది ఏందని ఇరువర్గాల మధ్యన చిన్న సంభాషన చిలికి చిలికి గాలివానై ఘర్షణకు దారి తీసిందని వెల్లడించారు. ఈ ఘర్షనకు సంబంధించిన విషయంలో ఇరువర్గాలపైన రెండు కేసులలో మొత్తం 16మందిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు. వీరిందరిపైన దొమ్మి కేసు నమోదు చేశామని. అయితే కొంత మంది సామాజిక మద్యంలో ప్రచురితమైన విధంగా ఆవేశపూరితంగా జరిగిన ఘర్షణ కాదన్నారు. సామాజిక మధ్యమాలలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే విధంగా పోస్టులు చేసే వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

గరిడేపల్లి, జూన్ 23 : ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేం ద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణామాఫీ చేయాలని, రైతులందరికి రైతుభరోసా నిధులు అందించాలని, నకిలీ విత్తనాలను నిర్మూలించి ఎరువులు, విత్తనాల ధరలను తగ్గించాలన్నారు. లేనిపక్షంలో స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయం, అప్పులపై అవగాహన లేకుండా ఎలా వాగ్దానాలు చేశారని విమర్శించారు.

# నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడు 'ఉన్నం'



*హనుమంతరావు సంతాప సభలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి*

కోదాడటౌన్, జూన్ 23 : రాజకీయాల్లో నీతి, నిజాయితీ నిబద్ధత కలిగిన నాయకుడు ఉన్నం హనుమంతరావు అని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్‌లు అన్నా రు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు ఉన్నం హనుమంతరావు సంతాప సభ సోమవారం కోదాడ పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి నిజాయితీలు కరువైన ఈ రోజు ల్లో గత 40 సంవత్సరాలుగా ఒకే పార్టీని నమ్ముకొని ప్రజలకు సేవ చేశారని రైతుల కోసం సమాజ కోసం ఇంకా ఎంతో సేవ చేయాల్సి ఉన్న హనుమంతరావు, మన మధ్యన లేకపోవడం బాధాకరం అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలోకి మారినప్పటికి తెలుగుదేశం పార్టీ అంటే ఆయనకు ఎక్కడా లేని అభిమానం అన్నారు. నేటి నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశ్రాంత ప్ర ధానోపాధ్యాయులు మత్తవరపు రా మారావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరుపతమ్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, మాజీ సర్పంచులు, పారా సీతయ్య, ఎర్నేనిబాబు, తొండపు సతీష్, నంబూరి సూర్యం, మల్లెల రాణి, డాక్టర్ సుబ్బా రావు, రామారావు, ఓరుగంటి ప్రభాకర్, ముత్తినేని సైదేశ్వరరావు, కుటుంబ సభ్యులు కనకమ్మ, ఉన్నం శ్రీనివాసరావు, లత, శ్రీలక్ష్మి, హనుమంతరావు ఉన్నారు.